క్లుప్తంగా

రక్తదానం



ఆర్డీఓ కృష్ణనాయక్‌కు మెమెంటో అందిస్తున్న బ్రహ్మకుమారీస్

సీటీఆర్ఐ: రక్తదానం చేసి మరోకరికి ప్రాణ దాతలు కావాలని ఆర్డీఓ ఆర్.కృష్ణనాయక్ పిలుపునిచ్చారు. ఓం శాంతి ప్రజాపిత బ్రహ్మ కుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయం విశ్వబంధుత్వ దినోత్సవం సందర్భంగా శనివారం స్థానిక ఆనంరోటరీ హాల్‌లో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమంలో 63 మంది రక్తదాతలు రక్తదానం చేశారు. ఈ సంర్భంగా ఆయన మాట్లాడుతూ బ్రహ్మకుమారీస్ పాజిటివ్ థింకింగ్‌తో జీవితాన్ని ఏ విధంగా గడపాలి అనేది నేర్పిస్తారన్నారు. ఇటువంటి రక్తదాన శిబిరాలు వల్ల రక్తం అత్యవసర పరిస్థితిల్లో ఉన్నవారికి చాలా ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో గైట్ కాలేజ్ ప్రిన్సిపాల్ డాక్టర్ పీజీ రామానుజం, వైస్ ప్రిన్సిపాల్ కిరణ్, లయన్స్ క్లబ్ గవర్నర్ కోటేశ్వరరావు, నగర బ్రహ్మకుమారిస్ సెంటర్ ఇంచార్జ్ హేమ తదితరులు పాల్గొన్నారు. రక్తదానం అనంతరం రక్తదాతలకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు.

ఒకటిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ పర్యటన



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ వీర్రాజు

రాజమహేంద్రవరం రూరల్: వచ్చేనెల ఒకటో తేదీన జిల్లాలో ప్రారంభం కానున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ పర్యటనను విజయవంతం చేయాలని బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యులు, ఎమ్మెల్సీ సోము వీర్రాజు పిలుపునిచ్చారు. కాతేరు శాంతినగర్‌లో శనివారం అచ్చుల కల్యాణమండపంలో మండల అధ్యక్షుడు నాగల శివకుమార్ అధ్యక్షతన పోలింగ్‌బూత్‌ల కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన సోము వీర్రాజు మాట్లాడుతూ కష్టపడే కార్యకర్తలకు పార్టీలో ఎప్పుడు గుర్తింపు ఉంటుందన్నారు. ప్రతి ఒక్కరూ ఎన్డీఏ కూటమి ప్రభు త్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి పార్టీని బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అసెంబ్లీ కో కన్వీనర్,యానాపు ఏసు, జిల్లా ఉపాధ్యక్షులు బండి ప్రసాద్, స్వామి సూర్యకిరణ్, పడాల హత్తిరామ్, కాలెపు సత్య సాయిరాం, మండల జనరల్ సెక్రెటరీ సురేష్, నరసవేణి, కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

మాన్ సూన్ హైజీన్‌పై అవగాహన



కార్యక్రమంలో మాట్లాడుతున్న రామచంద్ర

కంబాలచెరువు: ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో మాన్ సూన్ హైజీన్‌పై అవగాహన కార్యక్రమం శనివారం నిర్వహించారు. వరదల వల్ల కలిగే ప్రమాదాలు, వర్షాకాల అంటు వ్యాధుల నియంత్రణ, తీవ్రమైన వాతావరణ పరిస్థితులకు సిద్ధం కావడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్ర ఆర్‌కే తెలిపారు. సురక్షితమైన నీటి నిల్వ, సరైన పారిశుధ్య పద్ధతులు, దోమల నియంత్రణ చర్యలు, వ్యక్తిగత పరిశుభ్రతపై సూచనలు అందించామన్నారు. మలేరియా, డెంగీ, కలరా వంటి వ్యాధులను నివారించేందుకు జాగ్రత్తలు వివరించామన్నారు. ఆరోగ్య సమస్యలు, వాటి నివారణ చర్యలపై సమాచారాత్మక పోస్టర్లను రూపొందించి ప్రదర్శించారు. కార్యక్రమంలో రెడ్ క్రాస్ వలంటీర్లు ఎన్‌సీసీ, వైఆర్‌సీ కోఆర్డినేటర్లు పాల్గొన్నారు.

హస్తకళలను ప్రోత్సహించాలి

సిటిఆర్ఐ: హస్తకళలను ప్రోత్సాహించడం మన సంస్కృతికి, కళాభివృద్ధికి అత్యంత అవసరమని, ఇటువంటి అరుదైన హస్తకళా ప్రదర్శనను సందర్శించి కళాకారులను ప్రోత్సాహించాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. శనివారం సాయంత్ర స్థానిక జాంపేటలోని శ్రీ ఉమా రామలింగేశ్వర స్వామి వారి కల్యాణ మండపంలో హస్తకళల థీమాటిక్ ఎగ్జిబిషన్‌ను ఆమె ప్రారంభించారు. ఈ ప్రదర్శనను ఏపీఇట్కో లిమిటెడ్ నిర్వహించగా, కేంద్రీయ వస్త్ర మంత్రిత్వశాఖ పరిధిలోని హస్తకళల అభివృద్ధి కమిషనర్ కార్యాలయం నిధులు అందజేసింది. ఈ ప్రదర్శనలో దక్షిణ భారతదేశానికి చెందిన వివిధ కళాకారులు 50 స్టాళ్లలో చెరియాల్ పెయింటింగ్స్, కొండపల్లి బొమ్మలు, వుడెన్ లాక్వేర్ టాయ్స్, లాక్ బ్యాంగిల్స్, కలంకారి, హ్యాండ్ ఎంబ్రాయిడరీ, పామ్ లీఫ్ క్రాఫ్ట్స్, ఎలూరు కార్పెట్స్, బాబిన్ లేస్, స్టోన్ కార్వింగ్స్, పాటరీ, క్రోచెట్ లేస్, జ్యూట్ ఉత్పత్తులు, ఇమిటేషన్ జ్యూవెలరీ తదితర హస్తకళలను ప్రదర్శిస్తున్నారు. ఈ ప్రదర్శన సెప్టెంబర్ ఒకటి వరకు కొనసాగుతుందని నిర్వాహకులు తెలిపారు. హస్తకళల సహాయ సంచాలకులు అపర్ణాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వచ్చాడయ్యో సామీ!





అమ్మకానికి సిద్ధంగా ఉన్న మట్టి గణపతి విగ్రహాలు



మట్టి విగ్రహాలను తయారు చేస్తున్న తయారీదారుడు ప్రసాద్

- గ్రామాల్లో చవితి వేడుకల సందడి
- మట్టి విగ్రహాలకు పెరిగిన డిమాండ్
- ప్రజల్లో పెరుగుతున్న అవగాహన
- పర్యావరణ పరిరక్షణపై దృష్టి

ధవళేశ్వరం: వినాయక చవితి వేడుకల మొదలైపోయాయి. గ్రామాల్లో సండి నెలకొంది. మార్కెట్‌లో మట్టి విగ్రహాలకు డిమాండ్ పెరిగింది. పర్యావరణ పరిరక్షణను దృష్టిలో ఉంచికుని ప్రతి ఒక్కరూ మట్టి విగ్రహాలను కొనుగోలు చేసి పూజించాలని ఆసక్తి చూపుతున్నారు. గతంలో వినాయక చవితి వస్తుందంటే చాలు మూడు నెలల ముందు నుంచే చేతి నిండా పని ఉంటుంది. విగ్రహాల తయారీ కళాకారులు వినాయకుడి విగ్రహాల తయారీలో నిమగ్నమయ్యేవారు. పెద్ద పెద్ద విగ్రహాలను తయారీ చేసి విక్రయించేవారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారు చేసిన విగ్రహాలనే ఎక్కువగా కొనుగోలు చేసేవారు. ఇవి మార్కెట్‌లోకి రావడంతో మట్టి విగ్రహాలకు డిమాండ్ తగ్గింది. అసలే మట్టి పాత్రలకు, కుండీలకు, కుండలకు డిమాండ్ తగ్గిన నేపథ్యంలో మట్టి విగ్రహాలకు కూడా డిమాండ్ తగ్గడంతో వీటిపైనే ఆధారపడి జీవించే కుమ్మర్లు తీవ్ర ఆర్థిక ఒడిదొడుకులకు గురవుతున్నారు. దశాబ్దాల కాలంగా వీటిపైనే ఆధారపడి జీవించే కుల వృత్తుల వారు ఇతర పనులకు మళ్లారు. అయినప్పటికీ కొందరు నేటికీ వీటినే నమ్ముకొని జీవనం సాగిస్తున్నారు. తమకు మంచి రోజులు వస్తాయని ఆశతో ఎదురుచేస్తున్నారు. పర్యావరణ పరిరక్షణపై ఇటీవల కాలంలో ప్రజల్లో వచ్చిన చైతన్యంతో గత ఏడాది కొంత మంది తిరిగి ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలను కాదని మట్టి విగ్రహాల వైపు మళ్లారు. ఈ ఏడాది కూడా మట్టి విగ్రహాల కొనుగోలుదారులు పెరుగుతున్నారే విగ్రహాల తయారీదారులు చెబుతున్నారు.

అందుబాటు ధరలో..

వినాయక చవితి సందర్భంగా పూజల్లోకి వినియోగించే మట్టి గణనాథుని విగ్రహాలను ప్రతి ఒక్కరికి అందుబాటు ధరలో ఉన్నాయి. రూ.12 నుంచి రూ.30 వరకు ఈ విగ్రహాలను విక్రయిస్తున్నారు. ఇటీవల పలు స్వచ్ఛంద సంస్థలు సైతం ముందుకు వచ్చి మట్టి గణనాథుని విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేస్తుండడంతో ప్రజల్లో కూడా వీటిపై అవగాహన పెరిగింది. ఈ ఏడాది డిమాండ్ బాగుంటుందన్న ఉద్దేశంతో భారీగా మట్టి గణనాధుని విగ్రహాలు తయారు చేసి అమ్మకాలకు సిద్ధంగా ఉంచారు.

పర్యావరణానికి మేలు

వినాయక చవితి ఉత్సవాల్లో సాధ్యమైనంత వరకు మట్టి గణనాథుని విగ్రహాలు వినియోగించి పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని పర్యావరణ వేత్తలు సూచిస్తున్నారు. కెమికల్స్ ఉపయోగించి తయారు చేసే ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలతో తాగునీటి జలాలు కలుషితమయ్యే ప్రమాదం పొంచి ఉందని హెచ్చరిస్తున్నారు. అదే విధంగా మట్టి విగ్రహాల కొనుగోలు ద్వారా చేతి వృత్తుల వారిని ప్రోత్సహించినట్టు ఉంటుందని స్పష్టం చేస్తున్నారు.

డిమాండ్ ఉంటుందని ఆశిస్తున్నాం

గణనాథుని మట్టి విగ్రహాలకు ఈ ఏడాది డిమాండ్ ఉంటుందని ఆశిస్తున్నాం. గత రెండు నెలలుగా కుటుంబం మొత్తం విగ్రహాలను తయారు చేస్తున్నాం. తక్కువ ధరకే విగ్రహాలకు విక్రయిస్తున్నాం.

– వి.ప్రసాద్,
మట్టి విగ్రహాల తయారీదారుడు, ధవళేశ్వరం

కడియం నర్సరీలు అద్భుతం



మొక్కలను తిలకిస్తున్న హైకోర్టు జడ్జి కిరణ్మయి, నర్సరీ అధినేత మల్లు పోలరాజు తదితరులు

కడియం: కడియం ప్రాంత నర్సరీలు అద్భుతమని హైకోర్టు జడ్జి కిరణ్మయి అన్నారు. కడియపులంకలోని శ్రీ శివాంజనేయ నర్సరీని జడ్జి శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా నర్సరీ అధినేత మల్లు పోలరాజు ఆమెకు ఘన స్వాగతం పలికి నర్సరీలోని వివిధ రకాల మొక్కలను గురించి వివరించారు. భూమి, నీరు, గాలిలో బతికే మొక్కలన్నీ కడియం ప్రాంత నర్సరీల్లో లభిస్తున్నాయని, ఇంతటి వైవిధ్యమైన మొక్కలను అభివృద్ధి చేస్తున్న నర్సరీ రైతుల నైపుణ్యం గొప్పదని అన్నారు. నర్సరీ రైతు మల్లు శివ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

సమాజంలో ప్రతి ఒక్కరూ ప్రశ్నించాలి

కంబాలచెరువు: సమాజంలో ప్రతి ఒక్కరూ ప్రశ్నించే పౌరులు కావాలని ఏపీఈపీడీసీఎల్ సూపరింటెండెంట్ ఇంజనీర్ కె.తిలక్‌కుమార్ అన్నారు. స్థానిక ఎస్‌కేవీటీ డిగ్రీ కళాశాల ఆడిటోరియంలో గార్డ్స్ ఫర్ ఆర్‌టీఐ, వీటీ డిగ్రీ కళాశాల సంయుక్త అధ్వర్యంలో శనివారం ఆర్‌టీఐ 20 వసంతాల వేడుక జరిగింది. ఈ సందర్భంగా కందుకూరి వీరేశలింగం పంతులు, రాజ్యలక్ష్మీ దంపతుల చిత్రపటాలకి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా తిలక్ కుమార్ మాట్లాడుతూ సమాచార హక్కు చట్టాన్ని ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని దాని ద్వారా మంచి సమాజం ఏర్పాటు అయ్యేలా చూడాలని సూచించారు. రాజ్యాంగంలో ఆర్టికల్ 19 ప్రకారం భావ ప్రకటన స్వేచ్ఛ ప్రకారంలో సమాజంలో జరిగే రుగ్మతను ప్రశ్నించాలన్నారు. ఉన్న స్వేచ్ఛను ఉపయోగించుకొని మంచి సమాజం కోసం విద్యార్థులు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో గుత్తుల మురళీధరరావు, గార్డ్స్ జాతీయ కన్వీనర్ నాగేశ్వరరావు, న్యాయవాది ఉమామహేశ్వరి, గార్డ్స్ జాతీయ కన్వీనర్ ఆకుల విజయభారతి, కళాశాల ప్రిన్సిపల్ బీవీ.తిరుపాణ్యం, గార్డ్స్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ పీవీబీ.సంజీవరావు, మాజీ కార్పొరేటర్ పిల్లి నిర్మల, తదితరులు పాల్గొన్నారు.

చవితి ఉత్సవాల అనుమతికి సింగిల్ విండో ఏర్పాటు

రాజమహేంద్రవరం రూరల్: వినాయ కచవితి ఉత్సవాల నిర్వహణ అనుమతి కోసం సింగిల్ విండో విభాగం సెల్ హుకుంపేట మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసినట్లు ఎంపీడీవో ఆర్మ్‌స్ట్రాంగ్, తహసీల్దార్ శ్రీనివాసరావు తెలిపారు. శనివారం సాయంత్రం హుకుంపేట మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో, తహసీల్దార్, ధవళేశ్వరం పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ గణేష్, ఎలక్ట్రికల్ ఏఈ శ్రీనుబాబు, మండల పరిషత్ కార్యాలయ పరిపాలనాధికారి ఆకెళ్ల వరప్రసాద్, అగ్నిమాపక అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సింగిల్ విండో విభాగంలో ఏఎస్సై, ఎలక్ట్రికల్ ఏఈ, అగ్నిమాపక ఫైర్‌మెన్, వీఆర్‌వో, జీఎంఎస్‌కేలను నియమించారు. ఈసింగిల్ విండో విభాగం సెల్ ఈనెల 26వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తుల స్వీకరిస్తామని ఎంపీడీవో, తహసీల్దార్లు తెలిపారు.

రాజమహేంద్రవరం సిటీ: నగరపాలక సంస్థ పరిధిలో వినాయక చవితి ఉత్సవాలు నిర్వహించు ఉత్సవ కమిటీలకు సింగిల్ విండో విధానంలో అనుమతులు మంజూరు చేసేందుకు ఏర్పాట్లు చేపినట్లు జిల్లా కలెక్టర్, నగర పాలక సంస్థ ఇన్‌చార్జి కమిషనర్ ప్రశాంతి శనివారం ప్రకటించారు. అనుమతులు పొందేందుకు నగరపాలక సంస్థ కార్యాలయం రెండో అంతస్తులో పట్టణ ప్రణాళికా విభాగంలో సెల్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈనెల 26వ తేదీ సాయంత్రం 5 గంటల వరకూ దరఖాస్తులు స్వీకరిస్తారన్నారు.

ప్రభుత్వ మహిళా ఉద్యోగులకు ఐరన్ మాత్రల పంపిణీ



కార్యక్రమంలో పాల్గొన్న డీఎంఅండ్‌హెచ్‌వో వెంకటేశ్వరరావు

రాజమహేంద్రవరం రూరల్: ప్రభుత్వ కార్యాలయాల్లో పని చేస్తున్న 20–49 ఏళ్ల వయసున్న ఉద్యోగినులకు, మహిళా సిబ్బందికి ఐరన్ మాత్రల పంపిణీ చేస్తునట్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా.కె.వెంకటేశ్వరరావు తెలిపారు. శనివారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో, వైద్య ఆరోగ్య శాఖ, జిల్లా శిశు సంక్షేమ శాఖ కార్యాలయ ఉద్యోగినులకు, మహిళా సిబ్బందికి ఐరన్ మాత్రలు పంపిణీ చేసే కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలలో జిల్లా ఇమ్యునైజేషన్ అధికారిణి డా. పి. కోమల, కొవ్వూరు డిప్యూటీ డీఎం అండ్ హెచ్‌ఓ డా.సంధ్య, ప్రోగ్రాం అధికారులు డా. శ్రీవల్లి, డా. మౌనిక, ఆఫీస్ సూపరింటెండెంట్ తారాకుమారి, డిప్యూటీ పబ్లిక్ హెల్త్ నర్సింగ్ ఆఫీసర్ టి. సత్యవతి, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బాలుర వసతి గృహం సందర్శన

కంబాలచెరువు: జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జ్ ఎన్.శ్రీలక్ష్మి ప్రభుత్వ బాలుర పర్యవేక్షణ గృహాన్ని శనివారం సందర్శించి వసతులు, సౌకర్యాలను సమీక్షించారు. ఆమె అక్కడ ఉన్న బాలురతో మాట్లాడి వారి పరిస్థితులు తెలుసుకున్నారు. ఆమె మాట్లాడుతూ వ్యసనాలకు, చెడు స్నేహాలకు దూరంగా ఉంటూ విద్యపై దృష్టి పెట్టాలన్నారు. క్రమశిక్షణ, సహనం వంటి లక్షణాలు వ్యక్తిత్వ అభివృద్ధికి అత్యంత అవసరమని, వాటిని అలవర్చుకుంటే మంచి స్థాయికి చేరుకోవచ్చన్నారు. వసతి గృహంలో ఎటువంటి సమస్యలు ఉన్నా, న్యాయ సహాయం అవసరమైనా జిల్లా న్యాయ సేవాధికార సంస్థను నేరుగా సంప్రదించవచ్చన్నారు.

రేపటి నుంచి స్మార్ట్ రేషన్ కార్డుల నమోదు



రేషన్ షాపు రికార్డులను పరిశీలిస్తున్న ఆర్డీఓ కృష్ణనాయక్

సీటీఆర్ఐ: ఈ నెల 25వ తేదీ నుంచి ప్రతి ఒక్కరూ తమ రేషన్ కార్డులను స్మార్ట్ రేషన్ కార్డులుగా మార్చుకోవాలసి ఉంటుందని ఆర్డీఓ కృష్ణనాయక్ అన్నారు. శనివారం స్థానిక విద్యానగర్‌లోని 103 నంబర్ రైస్ షాపు, 68 నంబర్ రైస్ షాపులను ఆకస్మికంగా తనిఖీ నిర్వహించి స్టాక్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో మొట్ట మొదటి సారి స్మార్ట్ రేషన్ కార్డులు నమోదు ప్రక్రియ తూర్పుగోదావరి జిల్లాలో జరుగుతుందన్నారు. మొదటి విడతగా తొమ్మిది జిల్లాలు ఎంపిక కాగా రేపటి నుంచి మన జిల్లాలో నమోదు కార్యక్రమం జరుగుతుందన్నారు. ఈనెల 25వ తేదీ నుంచి రేషన్ కార్డుదారులు అందరికీ కూడా స్మార్ట్ రైస్ కార్డులు అందుబాటులోకి రానున్నాయన్నారు. రేషన్‌కార్డుదారులు తమ తమ సచివాలయ వద్ద నూతన కార్డులను పొందవచ్చన్నారు. వృద్ధులకు ఇంటి వద్దే ఈ రేషన్ కార్డులను అందిస్తారన్నారు.

రొమాంటిక్ కామెడీ కుటుంబ కథా చిత్రం ‘సుందరకాండ’



సమావేశంలో మాట్లాడుతున్న హీరో నారా రోహిత్, చిత్రంలో హీరోయిన్లు శ్రీదేవి, వాఘుని, నిర్మాత సంతోష్

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): ‘సుందరకాండ’ సినిమా రొమాంటిక్ కామెడీతో కూడిన ఒక మంచి కుటుంబ కథా చిత్రమని హీరో నారా రోహిత్ అన్నారు. వినాయక చవితి రోజున విడుదలయ్యే ఈ సినిమా ప్రేక్షకులను తప్పకుండా ఆకట్టుకుంటుందని ఆనందం వ్యక్తం చేశారు. వెంకటేష్ నిమ్మలపూడి దర్శకత్వం వహించిన సుందరకాండ చిత్రం ఈ నెల 27వ తేదీన విడుదలవుతున్న నేపథ్యంలో చిత్ర ప్రమోషన్‌లో భాగంగా శనివారం స్థానిక హోటల్ షెల్టన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో నారా రోహిత్ సినిమా విశేషాలను పంచుకున్నారు. ‘సుందరకాండ’ చిత్రం అందరి హృదయాలను తాకుతుందన్నారు. కుటుంబ సమేతంగా చూసి అందరూ ఆనందించాలని కోరారు. గతంలో వచ్చిన వెంకటేష్ సుందరకాండకు దీనికి సంబంధం లేదని, అలాగే పౌరాణికంగా కూడా ఉండదని, ఇది ఒక అందమైన ప్రేమకథ అని వివరించారు. ఈ సినిమాలో ప్రదీశ్ డైరెక్టర్ ఆఫ్ ఫొటోగ్రఫీ, లియోన్ జేమ్స్ సంగీతం, సంతోష్ నిర్మాతగా ఉన్నారు. కథానాయికలు శ్రీదేవి విజయ్‌కుమార్, విర్తి వాఘుని, హీరో నాగశౌర్య, నటులు నరేష్, వాసవి, సత్య తదితరులు సినిమాను ఆదరించాలని ప్రేక్షకులను కోరారు.

రాహుల్ ప్రధాని అయితే బీసీలకు రిజర్వేషన్

జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు విశ్వేశ్వర రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న విశ్వేశ్వరరెడ్డి

రాజమహేంద్రవరం సిటీ: దేశానికి రాహుల్ గాంధీ ప్రధాన మంత్రి అయితే బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించనున్నట్టు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు డాక్టర్ టీకే విశ్వేశ్వర రెడ్డి వెల్లడించారు. శనివారం నగరంలో స్థానిక ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు అమలు అవుతున్నాయంటే అది మాజీ ప్రధాన మంత్రి, దివంగత రాజీవ్ గాంధీ చలవేనన్నారు. 73వ రాజ్యాంగ సవరణ ద్వారా రాజీవ్ గాంధీ మహిళలకు 33శాతం రిజర్వేషన్ కల్పించారన్నారు. రాహుల్ గాంధీని ప్రధాన మంత్రిని చేస్తే బీసీలకు 42 శాతం రిజర్వేషన్ దక్కుతుందన్నారు. రాజీవ్ గాంధీ జయంతిని పురస్కరించుకుని రాజీవ్ ఫౌండేషన్ జాతీయ స్థాయిలో నిర్వహించిన మహిళలు వివిధ రంగాల్లో ఎదుగుదలపై కేసు స్టడీ పోటీల్లో మన జిల్లాకు చెందిన పీసీసీ ప్రధాన కార్యదర్శి అరిగెల అరుణకుమారి రాజకీయ ప్రయాణంపై రాజానగరం మండలానికి చెందిన దూలం అరుణ్ తేజ్ సమర్పించిన కేసు స్టడీ జాతీయ స్థాయిలో 7వ ర్యాంక్ సాధించిందని తెలిపారు. సమావేశంలో పట్నాల శ్రీనివాస్, బెజవాడ రంగారావు, జేటీ రామారావు, బిల్లర్ బాబి, కిషోర్ కుమార్ జైన్, కాటం రవికాంత్, బర్రే సుబ్రహ్మణ్యం, బత్తిన చంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

జీవిత బీమా సంస్థ అభివృద్ధికి కృషి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న సిద్ధార్థన్

రాజమహేంద్రవరం రూరల్: జీవిత బీమా సంస్థ అభివృద్ధికి ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ కృషి చేయాలని ఆలిండియా ఎల్‌ఐసీ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ జాతీయ ప్రధాన కార్యదర్శి సి.సిద్ధార్థన్ ఉద్యోగులకు పిలుపునిచ్చారు. శనివారం మోరంపూడిలోని ఏపీఎస్ఈబీ కల్యాణ మండపంలో ఎల్ఐసీ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ రాజమండ్రి డివిజన్ 33వ వార్షిక సర్వ సభ్య సమావేశం డివిజనల్ అధ్యక్షుడు జే వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన సిద్ధార్థన్ మాట్లాడుతూ దేశంలోనే జీవిత బీమా సంస్థ ఎంతో అభివృద్ధి చెందిందన్నారు. ఉద్యోగులు తమ సేవలను పూర్తిస్థాయిలో అందించాలన్నారు. ఈ సమావేశంలో విశిష్ట అతిథిగా పాల్గొన్న ఎల్ఐసీ రాజమండ్రి సీనియర్ డివిజనల్ మేనేజర్ సత్యనారాయణ సాహు మాట్లాడుతూ రాజమండ్రి డివిజన్ జీవిత బీమా సంస్థ వ్యాపారాలలోని జోనల్ లెవెల్‌లో ముందు స్థాయిలో ఉండేందుకు ఉద్యోగుల కృషి ఎంతో ఉందన్నారు. ఆంధ్ర యూనివర్సిటీ ప్రొఫెసర్ ఎస్ఏడీ పాల్ మాట్లాడుతూ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చూపిన మార్గంలో ఉద్యోగులందరూ పనిచేసే సమాజంలోని పేదరికం, అవిద్య అసమనతులను తొలగించుటలో తమవంతు కృషిచేయాలని కోరారు. రాజమండ్రి డివిజన్ అసోసియేషన్ అధ్యక్ష,ప్రధానకార్యదర్శిలు జే వెంకటేశ్వరరావు, సమతం గన్నయ్య మాట్లాడుతూ అంబేడ్కర్ ఆశయసాధనకు ప్రతి ఉద్యోగి కృషిచేయాలన్నారు. ఈ సమావేశంలో జోనల్ జనరల్ సెక్రటరీ ఆర్.వేంకటేశ్వరరావు, సామాజిక వేత్తా తాళ్లూరి బాబు రాజేంద్రప్రసాద్, పీఅండ్ఐఆర్ మేనేజర్ పూర్ణచంద్రరావు, హైదరాబాదు విశాఖపట్నం ప్రధాన కార్యదర్శులు కే విశ్వనిధి, గణపతి, డివిజనల్ నాయకులు శ్రీనివాస్, డీవీ కిషోర్, సీహెచ్ భాస్కర్, రాధాకృష్ణ, అరవిందు, కె.విద్యాసాగర్ రాజ్ కుమార్, అశోక్ కుమార్, అబ్రహం, శ్రీ కిరణ్, ఆనంద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

స్వర్ణాంధ్రలో ప్రజల భాగస్వామ్యం కీలకం

కలెక్టర్ ప్రశాంతి



కంబాలచెరువులో గంబూషియా చేపలు వదులుతున్న కలెక్టర్ ప్రశాంతి, ఎమ్మెల్సీ సోము వీర్రాజు

రాజమహేంద్రవరం సిటీ: స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర విజయవంతం కావడానికి ప్రజల భాగస్వామ్యం ఎంతో కీలకమని కలెక్టర్, ఇన్‌చార్జ్ కమిషనర్ పి.ప్రశాంతి అన్నారు. ఆ కార్యక్రమంలో భాగంగా శనివారం కంబాల చెరువు పార్కులో ఎమ్మెల్సీ సోము వీర్రాజుతో కలిసి ఉద్యోగులు, స్థానికులతో ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా డ్రోన్ సాయంతో కంబాల చెరువులో దోమల మందును పిచికారీ చేశారు. అనంతరం కలెక్టర్, ఎమ్మెల్సీ చేతుల మీదుగా చెరువులో దోమల నివారణకు గంబూషియా చేపలను విడిచిపెట్టారు. దోమలు వృద్ధి కేంద్రాలను ఎప్పటికప్పుడు గుర్తించి, లార్వా దశలోనే నియంత్రించడంపై దృష్టి సారించాలని పబ్లిక్ హెల్త్ సిబ్బందికి కలెక్టర్ సూచించారు. కాలువలు, కుంటల్లో ఆయిల్ బాల్స్ వేయడంతో పాటు రసాయనాలు పిచికారీ చేయాలన్నారు. ప్రజలు తమ ఇళ్లలో పాడైన ఎల్రక్టానిక్ వ్యర్థాలను ఉంచుకోవడం ద్వారా లేదా విచ్చలవిడిగా బహిరంగ ప్రదేశాల్లో పారవేయడం వల్ల వాయుకాలుష్యం పెరుగుతోందన్నారు. క్యాన్సర్ లాంటి ప్రాణాంతక వ్యాధులు వచ్చే అవకాశముందని, ఈ వ్యర్థాలను సేకరణ కేంద్రంలో అందజేస్తే వాటిని సరైన రీతిలో రీసైక్లింగ్ చేసి ముప్పు లేకుండా తొలగించడం జరుగుతుందన్నారు. ఎమ్మెల్సీ సోము వీర్రాజు మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా వాతావరణంలో వచ్చే మార్పులను అధిగమించేందుకు ప్రతి పౌరుడు సామాజిక బాధ్యతగా మొక్కలను పెంచాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ పీవీ రామలింగేశ్వర్, డిప్యూటీ కమిషనర్ ఎస్.వెంకటరమణ, సెక్రటరీ జి.శైలజావల్లి, ఎస్ఈ (ఇంజినీరింగ్) ఎంసీహెచ్ కోటేశ్వరరావు, సిటీ ప్లానర్ జి.కోటయ్య, మేనేజర్ ఎండీ అబ్దుల్ మాలిక్ పాల్గొన్నారు.

న్యాయస్థానాల సముదాయానికి టంగుటూరి పేరు పెట్టాలి



టంగుటూరి విగ్రహానికి నివాళులర్పిస్తున్న సమితి సభ్యులు

సీటీఆర్ఐ: నూతనంగా నగరంలో నిర్మిస్తున్న న్యాయస్థానాల సముదాయంలో ఒక విభాగానికి టంగుటూరు ప్రకాశం పంతులు పేరు పెట్టాలని ఆంధ్ర కేసరి యువజన సమితి కోరింది. టంగుటూరి ప్రకాశం పంతులు రాష్ట్రానికి మూడుసార్లు ముఖ్యమంత్రి చేయడమే కాకుండా న్యాయవాదిగా ఎంతో పేరు గడిచారని ఆయన పేరుని ఒక విభాగానికి పెట్టడం సముచితమని సమితి తెలియజేసింది. ఆంధ్రకేసరి యువజన సమితి ఆధ్వర్యంలో ప్రకాశం పంతులు 153వ జయంతి కార్యక్రమం స్వాతంత్ర్య సమరయోధులు పార్కులో శనివారం జరిగింది. టంగుటూరి ప్రకాశం పంతులు విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. సమితి అధ్యక్షుడు వి.భాస్కరరావు మాట్లాడుతూ నిస్వార్థ ప్రజాసేవకుడు టంగుటూరు ప్రకాశం పంతులు జీవిత చరిత్రని భావితరాల కోసం అందరూ చదవాలని కోరారు. ప్రముఖ రచయిత వారణాసి సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ రాజమండ్రి విమానాశ్రమానికి ప్రకాశం పేరు పెట్టాలని ఎప్పటి నుంచో ప్రతిపాదనలో ఉందని గుర్తు చేశారు. సమితి కార్యదర్శి సీపీరెడ్డి, కన్వీనర్ మాదిరాజు శ్రీనివాస్, పూర్వ అధ్యక్షుడు దేశిరెడ్డి బలరామ నాయుడు, సమితి సభ్యులు దుర్వాసుల సత్యనారాయణ, సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

బావితరాలకు స్ఫూర్తిదాయకం


రాజమహేంద్రవరం రూరల్: ఆంధ్ర రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశం పంతులు పోరాట పటిమ భవిష్యత్ తరాల స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందని రూరల్ తహసీల్దార్ పి.శ్రీనివాసరావు పేర్కొన్నారు. బొమ్మూరులోని రూరల్ తహసీల్దార్ కార్యాలయంలో టంగుటూరి జయంతిని శనివారం జరిగాయి. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి తహసీల్దార్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రకాశం పంతులు దేశభక్తి, సేవ నిరతి, ధైర్యాసాహసాలను సర్వే డిప్యూటీ తహసీల్దార్ ఎన్.సుహాసిని రాజకుమారి కీర్తించారు. డిప్యూటీ తహసీల్దార్ చైతన్యబాబు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, తహసీల్దార్ కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

పోటీతత్వం అలవర్చుకోవాలి

సీటీఆర్ఐ: విద్యార్థులతో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు క్విజ్ పోటీలు ఎంతగానో దోహదపడతాయని ఎస్‌కేవీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బీవీ తిరుపణ్యం అన్నారు. తెలుగు సారస్వత పరిషత్, కళా గౌతమి నిర్వహణలో తెలుగు మాటల పండగను పురస్కరించుకొని మూడో రోజు జరిగిన సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోటీ తత్వం ఉన్నప్పుడే నేర్చుకోవాలని ఆసక్తి పెరుగుతుందన్నారు. తెలుగు శాఖాధిపతి డాక్టర్ పీవీబీ సంజీవరావు ఆధ్వర్యంలో ప్రశ్నావళి పోటీలు ఘనంగా నిర్వహించారు. మహాభారతంలోని పాత్రలు, కవుల చరిత్ర లాంటి వివిధ ముఖ్యాంశాలపై జరిగిన ఈ క్విజ్(ప్రశ్నావళి) పోటీలు విద్యార్థులను ఎంతగానో అలరించాయి. దాదాపు పది జట్లు వివిధ కళాశాలలకు చెందిన విద్యార్థులు ఇందులో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పల్లి సుధా, జే సుగుణ, చీర్ల సీతారామనాయుడు, క్విజ్ మాస్టర్‌గా వ్యవహరించారు. తెలుగు శాఖ తరఫున ఆంధ్ర రాష్ట్రం తొలి ముఖ్యమంత్రి టంగుటూరు ప్రకాశం పంతులు జయంతి సందర్భంగా నివాళులు అర్పించారు.

పింఛన్లు కొనసాగించకుంటే నిరసన

- రేపు చలో రాజమహేంద్రవరం కలెక్టరేట్



సమావేశంలో ప్రసంగిస్తున్న ముత్యాల పోసికుమార్

ధవళేశ్వరం: తొలగించిన దివ్యాంగుల పింఛన్లు కొనసాగించాలని అఖిల భారత దివ్యాంగుల హక్కుల వేదిక జాతీయ కార్యదర్శి ముత్యాల పోసికుమార్ డిమాండ్ చేశారు. శనివారం ధవళేశ్వరంలో దివ్యాంగుల సంఘాల నాయకుల సమావేశం నిర్వహించారు. సమావేశానికి ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అఖిల భారత దివ్యాంగుల హక్కుల వేదిక జిల్లా అధ్యక్షుడు పలివెల రాజు అధ్యక్షత వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వచ్చిన అఖిల భారత దివ్యాంగుల హక్కుల వేదిక జాతీయ కార్యదర్శి ముత్యాల పోసి కుమార్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఖండవిల్లి భరత్ కుమార్ ప్రసంగించారు. పుట్టుకతో వైకల్యంతో బాధపడుతున్న దివ్యాంగుల వైకల్య శాతం తగ్గించడం దారుణం అన్నారు. దివ్యాంగుల పింఛనను కొనసాగించాలని కోరుతూ ఈనెల 25 తేదీన రాజమహేంద్రవరం కలెక్టరేట్ వద్ద నిరసన కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. దివ్యాంగులు భారీ సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమానికి సంబంధించిన పూర్తి వివరాలు 98496 40432, 98661 88321, 99124 95088 నంబర్లకు ఫోన్ చేసి తెలుసుకోవచ్చని వెల్లడించారు. సమావేశంలో జిల్లా గౌరవ అధ్యక్షుడు ఎం.తిరుపతి రావు(అను), దివ్యాంగుల విభాగం జిల్లా అధ్యక్షుడు సబ్బెళ్ల విజయదుర్గరెడ్డి, సాగర్, మహిళ అధ్యక్షురాలు బసనబోయిన దుర్గ తదితరులు పాల్గొన్నారు.